సాక్షి
హైదరాబాద్ । శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచినీటి పైపులైన్‌లు సరిగ్గా లేకపోవటం వల్ల నీరు రావటం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అదే విధంగా నూతన రోడ్లు, డ్రైనేజీ తాగునీటి వ్యవస్థ పనులు చేపట్టడానికి కావలసిన నిధులు కోసం అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగకు రంగధాముని చెరువు వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఇంజినీరింగ్ ఈఈ గోవర్ధన్, శ్రీనివాస్, డీఈ శ్రీదేవి, శంకర్, ఏఈ, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభాకర్, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు



కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బాలానగర్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కంటి, దంతాలపై నిత్యం సంరక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి త్రిభువన్, కోశాధికారి మల్లికార్జున్ రెడ్డి, ట్రస్టీ ధన శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: గచ్చిబౌలి డివిజన్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో నవంబర్ 9 నుంచి 10వ తేదీల్లో జరుగబోయే 11వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశ బ్రోచర్‌ను గురువారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రతినిధులు ఆర్ఎస్‌వీ బద్రీనాథ్, వీవీరావు, ఈశ్వరి, రామారావు, ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

తాగునీటి వృథాను అరికట్టలేరా?

- పైపులైన్ పగలడంతో 15 రోజులుగా వృథాగా పోతున్న వైనం
- పట్టించుకోని వాటర్ వర్క్స్ అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఆయా ప్రాంతాల్లో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క నీటి సమస్యతో ప్రజలు ఆయా ప్రాంతాల్లో అల్లాడుతుంటే 15 రోజులుగా తాగునీరు రోడ్డుపై పారుతున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. సింబలిక్‌గా ప్లాస్టిక్ సింబల్స్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ప్రధాన రహదారిలోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ముందు 15 రోజులుగా 8 ఇంచులా మెయిన్ పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. పైపులైన్ పగిలి మంచినీరు వృథాగా పోతుందని పలువురు వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. ఈ పైపులైన్ ద్వారా వచ్చే తాగునీరు ముందుగా స్టోరేజ్ చేసి రోజు వారీగా ఆయా ప్రాంతాలకు సరాఫరా చేస్తుంటారు. ఈ పైపులైన్ ద్వారా వచ్చే నీరు ఒక్కరోజు ఆగిపోయిన వివిధ ప్రాంతాలకు తాగునీటి సరాఫరా ఆగిపోతుంది. అలాంటి పైపులైన్ పగిలినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని కాలనీల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సిబ్బందిని అడిగితే.. ప్రధాన మంచినీటి పైపులైన్ కావడంతో మరమ్మతులు చేయడానికి ఒక్క రోజు పడుతుందని, దీని వల్ల నీటి సరఫరా చేసేందుకు సాధ్యం కాదన్నారు. త్వరలో చేస్తామని చెప్పారు. వారు చెప్పి వారం గడుస్తున్న మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయినగర్‌లో..

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో మంచినీటి పైపులైన్ లీకేజీతో ప్రతి రోజు తాగునీరు వృథాగా రోడ్లపాలవుతుంది. మెట్రో వాటర్‌వర్క్స్ అధికారులు మంచినీటి లీకేజీ విషయంలో సమయానుకూలంగా మరమ్మతులు చేపట్టకపోవడం వల్లే నీరు వృథా అవుతుందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి నీటి లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



సాయినగర్ వెస్ట్ ప్రాంతంలో పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు





ఓల్డ్ బోయిన్‌పల్లి విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ దగ్గర వృథాగా పోతున్న తాగునీరు

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాను పరిశీలిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి తదితరులు

చందానగర్: నిరుద్యోగ యువత కోసం జీహెచ్ఎంసీ సహకారంతో చందానగర్‌లోని లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాను చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి సందర్శించారు. లైట్ హౌస్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాబ్ మేళాలో నగరంలో 26 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. సుమారు 500 మంది ఈ జాబ్ మేళాలో పాల్గొని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ప్రాజెక్టు అధికారి ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'నిథమ్'లో ప్రపంచ పర్యాటక దినోత్సవం

పాల్గొననున్న సీఎం, పర్యాటకశాఖ మంత్రి

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిథమ్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. నిథమ్ ప్రాంగణంలో యోగా ప్రదర్శన, ఫుడ్ ఫెస్టివల్, సాంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

ప్రణాళికాబద్ధంగా నాలాల అభివృద్ధి

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని నాలాలను క్రమ పద్ధతిలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, నాలాల అభివృద్ధి ద్వారా కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌లో రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న నాలా బ్రిడ్జి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ గౌరీష్, నేతలు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సత్తిరెడ్డి, కిశోర్, యేసు, ఆంజనేయులు, రమణారెడ్డి, నజీర్, వెంకటేష్, అజయ్, బొడ్డు వెంకటేశ్వర్ రావు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నర్సింహా రెడ్డి, సెక్రటరీ మురళీ గౌడ్, సభ్యులు, దుర్గారావు, లింగం యాదవ్, చంద్రమౌళి, సుదర్శన్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

లింక్‌రోడ్డు ప్రారంభం

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి నుంచి బౌరంపేట రహదారిలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన లింక్ రోడ్డును ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, భరత్, సత్యనారాయణ, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు, నాయకులు సగ్గిడి శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నమ్మించి రూ. 4.70 కోట్లతో పరార్



ఇంటి ముందు ఆందోళనకు దిగిన బాధితులు

- చిట్టీల పేరుతో దంపతుల టోకరా
- నిందితుల ఇంటి వద్ద ధర్నా చేసిన బాధితులు

కుత్బుల్లాపూర్: చుట్టుపక్కల వారితో కలివిడిగా ఉంటూ వచ్చారు. చిట్టీలు వేస్తే లక్షాధికారులు అవుతారని నమ్మించారు. ఇక అంతే భార్యాభర్తలు కలిసి చిట్టీల పేరుతో కోట్ల రూపాయలకు శఠగోపం పెట్టి పరారయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరనగర్ రోడ్డు నెంబర్ -2 లో భార్యాభర్తలు మేకల నాగమణి, నాగమయ్య నివసిస్తున్నారు. నాగమయ్య ఓ ఫార్మా కంపెనీ ఉద్యోగం చేస్తుండగా.. నాగమణి చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ ఉండేది. 12 ఏళ్లుగా లక్ష రూపాయలు మొదలుకొని రూ.20 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తూ వస్తూ ఉండేది. నాగమణి దంపతులు ఏప్రిల్ రెండవ వారం నుంచి కనిపించకుండా పోయారు. వారి కోసం వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో బాధితులు తొలుత జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఎక్కువ మొత్తం ఉండటంతో పాటుగా పోగొట్టుకున్న డబ్బు నాలుగు కోట్లకు పైగా ఉండటంతో ఈఓడబ్ల్యూలో కేసు నమోదైంది. ఏప్రిల్ 16న కేసు నమోదు అయినప్పటికీ నేటి వరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని బాధితులు గురువారం పరారైన చిట్టీల వ్యాపారి ఇంటి వద్ద నిరసనకు దిగారు. పోలీసులు సదరు భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

మోతీనగర్: కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా ఎంపికైన నర్సింహ యాదవ్, మహ్మద్ జమీర్, ఎం.సుధాకర్ రెడ్డిని గురువారం కాంగ్రెస్ యువ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కనకయ్య, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వీటీం ప్రధాన కార్యదర్శి రవి, ట్రెజరర్ ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ బొంతు రవి, నాయకులు అహ్మద్, కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ మొగులమ్మ బస్తీకి చెందిన సంతోష్‌కుమార్‌కు లక్ష రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును గురువారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ: కోర్ సబ్జెక్టులను, భవిష్యత్‌లో రెగ్యులర్‌గా ఉపయోగపడే సబ్జెక్టులను అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధన చేయించాలని జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు కోరారు. గురువారం జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ జి.వి. నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, శివకృష్ణ మాట్లాడుతూ.. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమైన సందర్భంగా కోర్ సబ్జెక్టులకు, సీఎస్ఈ విద్యార్థులకు, అనుబంధ బ్రాంచీల విద్యార్థులకు సీ, సీ++, పీపీఎస్, పైథాన్ వంటి సబ్జెక్టులను, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంజినీరింగ్ మెకానిక్స్, ఇంజినీరింగ్ గ్రాఫిక్స్ వంటి సబ్జెక్టులను 4 నుంచి 5 సంవత్సరాలు బోధించిన అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే బోధన చేయించాలని కోరారు. కార్యక్రమంలో అనీష్, సిద్దార్థ, చంద్రశేఖర్ పటేల్, అరవింద్ కుమార్, రోహిత్, సాయికుమార్ నాయక్, ఇంద్రాని, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో వాటర్ నెట్‌వర్క్ డిజిటల్ ట్విన్ ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్, జెడ్ఎఫ్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో వాటర్ యుటిలిటీ నెట్‌వర్క్ కోసం తన వినూత్న డిజిటల్ ట్విన్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించారు. 5 నెలల క్రితం సీఎస్ఆర్ కింద నిర్ణయించిన మేరకు ప్రస్తుతం స్మార్ట్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్‌లో గణనీయమైన పురోగతి సాధించడంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ నోడ్‌లు (నీటి నాణ్యత, నీటి ప్రవాహం, నీటి స్థాయి, మోటారు నియంత్రణ) అమలు చేయబడ్డాయి. ఈ సందర్భంగా చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వాటర్(వాటర్ సీఓఈ) ఏర్పాటు కోసం ఒక ఒప్పందం కుదుర్చుకోవడంతో డిజిటల్ ట్విన్‌ను నిర్మించాలనే ఆలోచన వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దీపక్ గంగాధరన్, డాక్టర్ కార్తీక్ వైద్యనాథన్ పాల్గొన్నారు.



మూసాపేటలోని ధోబీఘాట్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగరాజు, సంజీవరావు, జ్యోతి, కృష్ణవేణి తదితరులు

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

కూకట్‌పల్లి(జోన్‌బృందం): తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు అన్నారు. ఆమె జయంతి సందర్భంగా గురువారం వివిధ పార్టీల నాయకులు ఆమె విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక ఐలమ్మ అని కొనియాడారు. రజాకార్లను తరిమికొట్టి తెలంగాణ సాయుధ పోరాటానికి బీజం వేసిందన్నారు.



మోతీనగర్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన రజక అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు లంక సంపత్ తదితరులు



ధోబీఘాట్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బండి రమేష్, నాయకులు



శ్రీశ్రీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

వై-సన్ చాలెంజ్ విజేతలకు అవార్డుల ప్రదానం



మొదటి స్థానంలో నిలిచిన జట్టు సభ్యులకు నగదు పురస్కారం అందిస్తున్న దృశ్యం

రాయదుర్గం: పట్టణ జీవనాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్, సిలికాన్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వై-సన్ చాలెంజ్ నిర్వహించారు. ఈ చాలెంజ్‌లో విజేతల జట్లకు గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విజేతలుగా టాప్-త్రీలో నిలిచిన వారికి నగదు పురస్కారాలు అందజేశారు. మొత్తం 266 జట్ల నుంచి దరఖాస్తులు రాగా అందులో పది జట్లను ఫైనల్‌కు ఎంపిక చేశారు. ఏపీలోని విజయవాడకు చెందిన 'టీమ్ డీబీఆర్ ఇన్నోవేటివ్' సహా ఆరు ఎస్ఎంఈలు, విద్యార్థుల జట్లు నాలుగు ఎంపిక అయ్యాయి. అందులో టాప్-3లో నిలిచిన వాటిలో మొదటిస్థానం డీబీఆర్ ఇన్నోవేటివ్ టెక్ సంస్థకు రూ.5 లక్షల నగదు పురస్కారం, రెండవ స్థానం హోరస్ సంస్థకు రాగా రూ. 2 లక్షల నగదు పురస్కారం, మూడోస్థానంలో నిలిచిన యంత్రం ఎలక్ట్రానిక్స్‌కు రూ.లక్ష నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సిలికాన్ ల్యాబ్స్ ప్రతినిధి శ్రీనివాస దుక్కిపాటి మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం మాట్లాడుతూ ఈ చాలెంజ్ సృజనాత్మకంగా ఆలోచించేలా ప్రేరేపించడమే కాకుండా ఆలోచనలకు జీవం పోసే సాధనాలు, వనరులను అందించిందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఫ్యాకల్టీ డాక్టర్ ఆఫ్తాబ్ హుస్సేన్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్‌ని కలిసిన నేతలు



ఆల్విన్‌కాలనీ: యువజన నాయకులు, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎరగాని నాగన్నగౌడ్, వి. భాస్కర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ జీతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో పోస్టల్ గ్రామీణ డాక్ సేవక్, బీఎస్ఎన్ఎల్ ఇన్‌ఫ్రా రంగ కార్మికుల సమస్యలపై ఢిల్లీ లెవెల్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

29న 'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవెనింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'మాన్యువల్ ఆఫ్ లైఫ్' అనే అంశంపై మౌంట్ అబూ స్పార్క్ వింగ్ కోఆర్డినేటర్ బికె సంజయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని సూచించారు.